మధుసూదన్‌కు మేయర్ అభినందన

విశాలాంధ్ర-గుంటూరు: హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కళాకారులకు నిర్వహించిన అవార్డ్స్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో 'మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో పేరు నమోదు కావడమే కాకుండా 'రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు' అందుకున్న చిత్రకారుడు మధుసూదన్‌ను గుంటూరు సంపత్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు బుధవారం సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరెంతోమంది కళాకారులను తయారు చేయాలని ఆకాంక్షించారు.

డా॥ బిధాన్ చంద్ర రాయ్ జయంత్యుత్సవం

విశాలాంధ్ర-దుగ్గిరాల: స్థానిక పభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బీసీ(బిధాన్ చంద్ర) రాయ్ జయంత్యుత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రలోని వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్, డాక్టర్ ఇందిరలను పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ సిద్దయ్య నాయుడు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ప్రసంగించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు నర్సులకు 'ఫ్లోరెన్స్ నైటింగేల్' పురస్కారాలను అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వర రావు, షేక్ సుభాని, కొండపనేని రవి, కుర్రా నాగయ్య, సైమన్ కిషోర్, బలుసుపాటి ఎల్లయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చూడండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గుంటూరు తూర్పు నియోజకవర్గం 10వ వార్డులోని జున్‌షైదా నగర్‌లో ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా బుధవారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాము డ్రైనేజీ సమస్యలతో తల్లడిల్లిపోతున్నట్లు చెప్పారు. దుర్గంధమైన మురుగునీరు రోడ్లపైకి రావటంతో తాము అనారోగ్య పాలవుతున్నట్లు వివరించారు. తక్షణమే ఎమ్మెల్యే ముస్తఫా డ్రైనేజీ సమస్య గురించి ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గ వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, 10వ డివిజన్ కార్పొరేటర్ మీరావలి, 4వ డివిజన్ కార్పొరేటర్ షేక్.మహమూద్, 13వ డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ అజయ్ యాదవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్ న్యూరాలజీ ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఈనెల 7 నుంచి 9 వరకు కర్నూలులో జరిగిన స్టేట్ న్యూరాలజీ న్యూరో సర్జరీ కాన్ఫరెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీ హెచ్) ఆసుపత్రి న్యూరాలజీ విభాగం సత్తా చాటింది. ఈ కాన్ఫరెన్స్‌లో తలలో ఒత్తిడి పెరిగి కంటి నరం దెబ్బతినడం..కంటి చూపు కోల్పోవడం వంటి పరిశోధనకు న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మదకు కాంట్రిబ్యూటర్ అవార్డ్ లభించింది. రూ.50వేల నగదుతో పాటు ప్రశంసా పత్రం ఆమె అందుకున్నారు. అదేవిధంగా డాక్టర్ కాం తిమ కూడా పోస్టర్ అవార్డు అందుకున్నారు. అవార్డులను అందుకున్న ఇద్దరిని ఆ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ సుందరాచారి, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు.

ముంపునకు గురైన మాగాణి భూముల పరిశీలన

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండలంలోని మంచికలపూడి రెవెన్యూ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని మాగాణి భూములు కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురికావడంతో స్థానిక రైతులు వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముంపుకు గురైన మాగాణీ భూములను రైతులతో కలిసి పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచికలపూడి రైల్వే గేటు వద్ద ఇటీవల మూడో లైన్ నిర్మాణంలో భాగంగా పంట కాలువలను రైల్వే అధికారులు పూడ్చారు. దీంతో వర్షపు నీరు అధికంగా చేరడంతో మాగాణి భూములు ముంపునకు గురయ్యాయి. ఆ పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే తక్షణమే రైల్వే అధికారులతో మాట్లాడి జేసీబీ సహాయంతో కాలువ పూడికతీత పనులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో ప్రారంభించారు. మోరంపూడి బంకింగ్ హామ్ కెనాల్ దగ్గర దెబ్బతిన్న స్లూయిజ్‌ను పరిశీలించి మరమ్మత్తులు నిర్వహించాలని సూచించారు. అలాగే డీఆర్‌బీసీ డ్రైన్ వద్ద దెబ్బతిన్న పైప్ లైన్ కూడా మరమ్మతులు చేపట్టాలని చెప్పారు.

ఆటో బోల్తా... వ్యక్తి మృతి

విశాలాంధ్ర-నాదెండ్ల: వేగంగా వెళుతున్న ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలైన సంఘటన నాదెండ్లలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విప్పర్ల మోహన్‌రావు తల్లి ఇటీవల మృతి చెందింది. ఆలయంలో నిద్ర చేసేందుకు భార్య ప్రమీలతో కలిసి చిలకలూరిపేటకు ఆటోలో బయలుదేరారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఆటో బోల్తా పడింది. తీవ్ర గాయాలైన మోహన్ రావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-గురజాల: విద్యార్థులు అందరూ సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ పద్మావతి తెలిపారు. బుధవారం మండలంలోని మాడుగులలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురు కులం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సాధారణ చికిత్సలకు సంబంధించి సుమారు 40 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మండల సీహెచ్‌ఓ రాణి, సూపర్‌వైజర్స్ సుబ్బాచారి, రాజమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ వి.హనుమంతరావు, విజయ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-రెంటచింతల: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన 'జగనన్న సురక్ష' పథకం ప్రజలకు వరం లాంటిదని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం మిట్టగుడిపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా అన్ని రకాల ప్రజా వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమం తీసుకువచ్చిందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్త నరేంద్ర రెడ్డి, సర్పంచ్ గొట్టం వెంకటేశ్వర రెడ్డి, వీఆర్వో బత్తుల వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామి రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ గారడికి జగన్, చంద్రబాబు విలవిల

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: నరేంద్ర మోదీ చేస్తున్న గారడికి రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబులు విలవిలలాడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ప్రతిపాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ప్రధాన మంత్రి మోదీ ఎత్తుగడ గారడీలకు రాష్ట్రంలోని పాలకపక్షం జగన్, ప్రధాన ప్రతిపక్షం చంద్రబాబులు దాసోహం అంటున్నారని దుయ్యబట్టారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన యాత్రలో ఆయా ప్రాంత సమస్యలను వదిలేసి అవగాహన రహిత్యముతో వలంటరీ వ్యవస్థపై దుర్భాషలాడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా ఉండాలని ఆగస్టు 9వ తారీఖున జిల్లా బహిరంగ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ప్రభుదాసు, పాపారావు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కార్యదర్శిగా ఆదేశ్వరరావు: ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శిగా రామిశెట్టి ఆదేశ్వరరావును, సహాయ కార్యదర్శిగా సోమేపల్లి అంజిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మెస్ చార్జీలు పెంచాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-గుంటూరు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఏఎస్‌డబ్ల్యూఓ చెంచులక్ష్మీని బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, నగరంలో ఉన్న కోడిగుడ్ల సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలని కోరారు. తక్షణమే పేద విద్యార్థులకు భవనాలు నిర్మించాలని, అలాగే మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానదీప్, యశ్వంత్, సాయి, చందు, బన్నీ, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్న చోటనే ఇళ్లకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలో రైల్వే స్థలాల్లో ఉంటున్న వారి ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రైల్వే స్థలాల్లో నివసిస్తున్న ప్రజలు 6- 14 వార్డుల సచివాలయానికి సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వెంకయ్య కొట్టు సెంటర్, సలాం హోటల్ సెంటర్, రన్నింగ్ రూం ప్రాంతం, పోతురాజు గుడి, ముగ్గురోడ్, లంబాడి పేటకు చెందిన వారు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రిని అడ్రస్ చేస్తూ వ్యక్తిగత అర్జీలు సచివాలయం అడ్మిన్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నాయకులు కొట్టె కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, కోట బాబురావు, దర్శినపు విజయ్ బాబు, దేవళ్ళ శంకర్, షేక్ సుభాని, షేక్ ఫిరోజ్, భీమవరపు దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆకస్మిక పర్యటనలో భాగముగా జాయింట్ కలెక్టర్ రాజకుమారి గుంటూరు తూర్పు మండలంలోని జొన్నలగడ్డ గ్రామములోని జడ్పీహెచ్ స్కూల్‌ను సందర్శించారు. గతేడాది 10వ తరగతి ఉత్తర్ణులైన విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ ఎక్కడ, ఏ కాలేజీలలో చేరినరో సమాచారం సేకరించ వలసినదిగా, అదేవిధముగా ప్రస్తుతం పాఠశాల నందు చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని 'చైల్డ్ ఇన్ఫో' వెబ్‌సైట్‌లో నమోదు చేశారా? లేదా అని అడిగి తెలుసుకొని చేయకుంటే వెంటనే నమోదు చేయవలసినదిగా ఆదేశించారు. జగనన్న విద్యకానుక పంపిణీ వివరాలు, నాడు నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు తహశీల్దార్, మండల ఎడ్యుకేషన్ అధికారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పబ్లిక్ స్థలాల్లో పెయింటింగులు, ఫ్లెక్సీలు బంద్

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి పురపాలక సంఘ పరిధిలో ప్రభుత్వ పబ్లిక్ స్థలాలు గోడలు రోడ్డు డివైడర్లపై గోడ ప్రతులు, పెయింటింగు వ్రాతలు ఫ్లెక్సీలపై నిషేధం ఉందని తెనాలి మున్సిపల్ కమీషనర్ జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1994 పబ్లిక్ స్థలాలు గోడల వికృతీకరణ చట్టం అనుసరించి పై నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించి నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం శిక్షకు గురౌతారన్నారు. ప్రకటనలు ఫ్లెక్సీలు రోడ్ల డివైడర్లపై ఇష్టా రాజ్యంగా ఉండటంతో పలు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయని వీటిపై నిషేధించాలని ట్రాఫిక్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గతంలో ఎప్పుడో ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ మృతి

విశాలాంధ్ర-తెనాలి: కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ పిన్నక శేషభాను రావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన భార్య జ్యోతి, కుమారుడు సుధీర్, కుమార్తె పల్లవి ఉన్నారు. ఆయన మరణవార్త తెలియగానే జిల్లా వ్యాప్తంగా ఆయన సహచర ఉద్యోగులు, బంధువులు, బ్యాంకు అధికారులు దు:ఖసాగరంలో మునిగిపోయారు. బ్యాంకు జిల్లా చైర్మన్ రామాంజనేయులు, తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాల నరేంద్రకుమార్, జి.డి.సి.సి. మాజీచైర్మన్ రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, బ్యాంకు ఆఫీసర్లు ఆయన భౌతికకాయానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వేలాదిమంది ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర-గుంటూరు: నగరపాలక సంస్థలో విధులు నిర్వహించే ఉద్యోగులు అంకిత భావం, జవాబుదారితనంతో విధులు నిర్వహించాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో హెచ్చరించారు. నగరపాలక సంస్థలో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ గత నెలలో రెవెన్యూ విభాగంలో ఏ2గా కేటాయించిన భాధ్యతలు స్వీకరించకుండా, అధికారుల అనుమతి లేకుండా ఎల్.శ్రీదేవి ఫేక్ మెడికల్ సర్టిఫికెట్‌తో దీర్ఘకాల సెలవులో వెళ్ళారన్నారు. కేటాయించిన భాధ్యతలు తీసుకుకోకపోవడం, ఉన్నత అధికారులకు ఎటువంటి సమాచారం అందించక పోవడం వలన నగరపాలక సంస్థ ఆదాయ వనరులకు భంగం వాటిల్లిందన్నారు. నగరంలో గడవు ముగిసిన ఆసీలు రెన్యువల్ జాప్యం అవ్వడంపై ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చకు వచ్చిందని, ఇందుకు కారణమైన శ్రీదేవి వ్యవహారశైలిపై అదనపు కమిషనర్‌ని విచారణకు ఆదేశించి, సదరు మెడికల్ సర్టిఫికెట్లను తనిఖీ నిమిత్తం మెడికల్ బోర్డ్‌కు పంపామన్నారు. మెడికల్ బోర్డ్ సదరు రిపోర్ట్‌లను పరిశీలించి ఫేక్ అని నివేదిక ఇచ్చిందన్నారు. కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించిన శ్రీదేవిపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ రూల్స్-1991 ప్రకారం క్రమశిక్షణా చర్యల్లో భాగంగా చార్జిమెమో జారీ చేశామని, 10 రోజుల్లో వ్రాత పూర్వక సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

టీడీపీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశానుసారం అచ్చంపేట మండల కేంద్రంలో వాగొడ్డు మొండి బండ బీసీ కాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వాగొడ్డు మొండిబండ బీసీ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి నాయకులు, కార్యకర్తలు వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. పార్టీ మండల అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, మాజీ ఎంపీటీసీ నియోజవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వీరమ్మ స్వామియేలు, తాళ్లూరి సుబ్బారావు, తిరువాయి పాటి ఆంజనేయులు, మల్లిశెట్టి నాగేశ్వరరావు, బోదెల సాంబిరెడ్డి, కంభంపాటి కిరణ్, అంగులూరి తిరుపతిరావు, కత్తుల కిషోర్, సందెపోగు వెంకట్రావు, దాసరి కత్తుల గోపి, వెంకన్న, సత్యం, కట్టారుపు శ్రీనివాసరావు, అంగులూరి వెంకటేష్, దాసరి అంజి, మారుబోయిన అంకమ్మరావు, శెట్టి సాంబయ్య, కన్నయ్య, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

2024లో టీడీపీ గెలుపు తథ్యం

విశాలాంధ్ర-రెంటచింతల: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని టీడీపీ గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం రెంటచింతలలో టీడీపీ నేత గొంటు ఆదిరెడ్డి ఇంట జరిగిన వేడుక కార్యక్రమంలో టీడీపీ నేతలు యరపతినేని శ్రీనివాసరావు, బ్రహ్మా రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆదిరెడ్డి కుమారులు సుమంత్ రెడ్డి, రవికిరణ్ రెడ్డిలు, కుమార్తెలు భవ్య సాయి, భాను తేజ, లక్ష్మీ రోహిత, లక్ష్మీ వర్షితలను ఆశీర్వదించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా సాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టీడీపీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి పగ్గాలు చేపడతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, దండే శివయ్య, మూలి రాజారెడ్డి, రాజ్ కుమార్, మారాసు శ్రీనివాసరావు, ముని నాయక్, మల్లయ్య యాదవ్, దానయ్య, రవి, భరత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

విశాలాంధ్ర-యడ్లపాడు: వ్యవసాయంలో అంతర పంటలతో అధిక లాభాలు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారిలు తెలిపారు. బుధవారం మండలంలోని కోట గ్రామాల్లో వీరు పర్యటించారు. కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రతి పంటలో పలు రకాల అంతర పంటలు వేయటం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. పంటల చాళ్ళ మధ్యలో పెసర, మినుము, ఆకుకూరలు, వరుసలోనే ప్రత్తి మొక్కల మధ్య క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి వంటి దుంప పంటలు, కూర గాయలు వేయ డం వలన భూమికి కావలసిన సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెంది జీవ వైవిధ్యం పెరిగి ప్రధాన పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎన్ఎఫ్ఏ సౌజన్య, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ర్యాంక్ కోసం ఓట్ ఫర్ యువర్ సిటీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా నగరపాలక సంస్థ సంస్థాగతంగా మెరుగైన పారిశుధ్య పనులు చేపడుతుందని, ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో 206 వార్డ్ సచివాలయాల పరిధిలో ఇంటింటి నుండి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, ఈ-ఆటోలు అందుబాటులోకి వచ్చినందున మరింతగా నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజారోగ్య కార్మికులు, కార్య దర్శులు, ఇన్స్పెక్టర్‌లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్‌ల వినియోగం, ఓటీపీ అంశాలపై అవగాహన కల్గించాలని ఆదేశించారు.

ఉపా, ఎన్ఐఏ చట్టాలను రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజాస్వామికవాదులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ ఉపా లాంటి క్రూరమైన చట్టాలను మోపి సంవత్సరాల తరబడి జైల్లో నిర్బంధించటం దుర్మార్గమని తక్షణం వారిపై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని విప్లవ రచయితల సంఘం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడ ధర్నా చౌక్‌లో ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమ కరపత్రాలు, పోస్టర్లను స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ దేశ ఖనిజ సంపదను, సహజ వనరులను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకులు తమను తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారని విమర్శించారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య నగర కార్యదర్శి ఎస్.పోతురాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, భీమ్ సేన సేవాదళ్ ఎస్.నీలాంబరం, భారత బచావో బి.కోటేశ్వరరావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ముత్తయ్య, రామచంద్రయ్య, వీరయ్య, మహేంద్ర పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TARIGOPULA VAMSI** (Old Name) S/o. TARIGOPULA SATYANARAYANA, R/o. D.No.2-33, Sakhamuru Village, Thullur Mandal, Guntur District - 522237, Andhra Pradesh, have changed my name to **TARIGOPULA VAMSI KRISHNA.** Hereafter my name is known as **TARIGOPULA VAMSI KRISHNA.**

డాక్యుమెంట్ పోయినది

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, చేబ్రోలు గ్రామ నివాసి **గోపవరపు రాజేశ్వరి, W/o. శ్రీనివాసరావుకు** చెందిన పొలం **డాక్యుమెంట్ నెం.6784/2017ను** తీసుకుని **02-07-2023న** చేబ్రోలు నుంచి ఆటోలో నారాకోడూరు వెళ్ళుతుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల **9948772946** ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరుచున్నాము.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి: నగర పరిధిలోని అంజుమన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల నామినేషన్‌లు ప్రారంభం కావడంతో మొదటిగా ఇస్లామిక్ ఫ్రంట్ తరపు నుంచి ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రం ఆధ్వర్యంలో బుధవారం తొమ్మిదిమంది సభ్యులు పాత మంగళగిరి నుంచి హనీషా ఖాదరి, హజ్రత్ అలీ, టిప్పర్ల బజారు నుంచి అల్లాబక్షు, 13వ వార్డు నుంచి హాఫీజ్ బద్రి, అక్బరి, 31వ వార్డు నుంచి అబ్దుల్ అలీం, అబ్దుల్ సలీం, కొత్తపేట నుంచి యాసీన్, నూర్ బాషా (మున్నా), టిప్పర్ల బజార్‌లోని క్లాసిక్ కళ్యాణ మండపం ఇస్లామిక్ ఫ్రంట్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లి నామినేషన్ వేశారు.

కృష్ణుడి గుడిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి పట్టణ పరిధిలో 15వ వార్డు టీడీపీ ఆధ్వర్యంలో నెహ్రూ బొమ్మ సెం టర్ వద్ద గల శ్రీ కృష్ణుడి గుడిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 153 రోజులు 2000 కిలోమీటర్లు పాదయాత్ర చేరుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధి కార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, టీడీపీ నాయకులు ఢిల్లీ రామా రావు, బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి, తాడిబోయిన భాస్కర్, మండవ గోపాలరావు, కళ్ళం బాపిరెడ్డి, ఉయ్యాల కోటేశ్వరరావు, కోగంటి వెంకటేశ్వరరావు, కోగంటి ప్రసాద్, పల్లపాటి శ్రీను, వేల్పూరి భాగ్యలక్ష్మి, షేక్ మస్తాన్ వలి, తాడిబోయిన గోపి, గద్దం శివమ్మ, కంభం సాయి చందు, కాటం అంజిరెడ్డి, దర్శి హరికృష్ణ, తురక దుర్గారావు, తుడిమెల్ల వజ్రబాబు, షేక్ నాగూర్ వలి, తోకల గిరీష్, ఎండీ బాషా పాల్గొన్నారు.

తాడేపల్లిలో వైసీపీ నేతల పర్యటన

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎంటీఎంసీ నగర వైసీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదేశాల మేరకు తాడే పల్లి పట్టణ పరిధిలోని ఆర్‌సీ ఎం చర్చి, అంబేద్కర్ కూడలి ప్రాం తాల్లో బుధవారం వైసీపీ నాయ కులు యు.కళ్యాణ్, ఎండీ సర్దార్, బాలస్వామి, దాసరి బుజ్జి, ఎండీ రఫీ పర్యటించారు. ఈ సందర్భంగా జగనన్న నవ రత్నాలు అమలు జరుగుతున్న తీరు వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కూరగాయల మార్కెట్ ఆధునీకరణకు చర్యలు

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాల సముదాయం సమీపంలోని కూరగాయల మార్కెట్ దెబ్బతిన్న షెడ్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ టిడ్కో గృహాల సముదాయం సమీపంలోని కూరగాయల మార్కెట్ షెడ్లు దెబ్బతిన్నాయని, కూరగాయల మార్కెట్ పర్మినెంట్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని కూరగాయల వ్యాపారులు తనను కలిసి వినతి పత్రం అందజేశారన్నారు. దీంతో బుధవారం కూరగాయల మార్కెట్‌ను పరిశీలించామన్నారు. మార్కెట్ నిర్వహణకు అనుకూలంగా శాశ్వత కట్టడానికి అనుకూల పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన కార్పొరేషన్లు తీసుకున్న నిర్ణయాలపై అధ్యయనం చేసి శాశ్వత కట్టడాల అనుకూల పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

వృత్తి నైపుణ్యం పెంచడంలో మీడియా అకాడమీ ముందంజ

విశాలాంధ్ర-గుంటూరు: వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. శాంతమూర్తి మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించటంతో పాటు జర్నలిజం విలువలు, యువ జర్న లిస్టులకు తెలియచేయడంలో మీడియా అకాడమి ముందంజలో ఉంటుం దన్నారు. డాక్టర్ కరుమంచి రవికుమార్, ఎం.ఎలీయా దానం, జాన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభను కనబరచాలని స్థానిక మార్నింగ్‌స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్. రెవ.డా. మద్దు బాలస్వామి అన్నారు. కళాశాలలో ఎన్.సి.సి 2021-2023 సంవత్సరానికి గాను క్యాడెట్‌లుగా శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థులకు బీ సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఫాదర్ మద్దుస్వామి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరినాధరెడ్డి, ఎన్‌సిసి ఉపాధ్యాయుడు కోటా నాయక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్ నాగరాజుకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి: స్థానిక ప్రెస్ క్లబ్ ఐబీఎన్ భవన్‌లో జర్నలిజంలో విశేషమైన సేవలు అందించడంతో పాటు తన పుట్టిన గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజును ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ నాగరాజు జర్నలిజంలో సమాజాన్ని చైతన్య పరచడంతో పాటు గ్రామంలో వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. జర్నలిజం వృత్తితోపాటు సామాజిక దృక్పథంతో నాగరాజు చేస్తున్న సేవలను ప్రతి జర్నలిస్టు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు ఎం.సిరిబాబు, గౌరవ సలహాదారులు బాపనపల్లి శ్రీనివాస్, కార్యదర్శి షేక్ సుభాని పాల్గొన్నారు.

బెంజిమెన్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గుంటూరు కుగ్లర్ హాస్పిటల్ ప్రాంగణంలోని చర్చి కమ్యూనిటీ హాల్‌లో దైవజనులు రెవరెండ్ పాస్టర్ జంగం బెంజిమెన్ సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఏఈఎల్సీ బిషప్ సీహెచ్ ఏలియా, పాస్టర్లు బెంజిమెన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఈఎల్సీ పాస్టర్లు జంగం విద్యాసాగర్, డి. సాల్మన్ రాజు, వెస్ట్ పారిష్ సంఘ కాపరి చేబ్రోలు రవి, స్థానిక సంఘ కాపరి డి.ఆశీర్వాదం, రెవ. చంద్రశేఖర్, రెవ. చార్లెస్, రెవ. జంగం జయ పాల్, మోహనరావు బెంజిమెన్, సంఘాల పాస్టర్లు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఘనంగా నాబార్డు 42వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-నకరికల్లు: మండలంలోని శివాపురం తండాలో బుధవారం నాబార్డు 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి దేవదాసు మాట్లాడుతూ గ్రామంలో నాబార్డు ఆర్థిక సహాయంతో మాతోట ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును గిరిజన రైతుకు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకోవాలని, గిరిజన రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పైపులను, కూరగాయలు పెంచుకునేందుకు రైతులకు రాయితీ ఇవ్వబడుతుందన్నారు. పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా సుస్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చన్నారు. ప్రాజెక్ట్‌లో భాగంగా గిరిజన మాతోట రైతులు 60 మందికి 150 కేజీల వేప పిండి, వానపాముల ఎరువును ఉచితంగా పంపిణీ చేశామన్నారు. హార్టికల్చర్ అధికారి డి.నవీన్‌కుమార్, అవార్డు సంస్థ కో-ఆర్డినేటర్ ఎం.సుధాకర్, శివాపురం తండా అధ్యక్షులు సక్యునాయక్, సంస్థ సభ్యులు ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడ్‌షెఫర్డ్ స్కూల్ విద్యార్థులకు అభినందన

విశాలాంధ్ర-వినుకొండ: 50వ గుంటూరు జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఇటీవల గుంటూరులో జరిగాయి. గుంటూరు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో వినుకొండ గుడ్ షెఫర్డ్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 11 సంవత్సరాలు విభాగంలో పి. త్రిలోక్, కే వరుణ్ కుమార్, షేక్ రియాజ్, కె హర్షవర్ధన్లు పాల్గొన్నారు. వీరిలో 13 సంవత్సరాల విభాగంలో డబుల్స్‌లో కే. కమల్ కుమార్, షేక్ రియాజ్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. గుడ్ షెఫర్డ్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి ఇన్నా రెడ్డి వీరిద్దరినీ అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసరాలతో ఇబ్బంది

విశాలాంధ్ర-వినుకొండ: పెరుగుతున్న నిత్యావసర సరుకులు, వంట గ్యాస్ ధరల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని అందించడం కష్టతరంగా మారిందని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు అంగలకుదురు ఆంజనేయులు తిరుమల లక్ష్మీలు అన్నారు. మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం 10వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కె రంజాన్ బి, ఎస్ పద్మ, సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, ఎస్ కె నాసర్ బి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు దారుణం

విశాలాంధ్ర-వినుకొండ: ప్రజా అవసరాల కోసం పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ తప్పుడు ప్రచారాలు చేయడం దుర్మార్గమైన చర్యని ప్రజలు చీ కొట్టే వరకు పవన్ తెచ్చుకొవద్దని వైసీపీ నాయకుడు నరేంద్ర అన్నారు. వినుకొండ రూరల్ మండలం వాలంటీర్లను కలుపుకొని స్తానిక మండల ఆఫీస్ నుండి ఎక్కువ సంఖ్యలో వాలంటీర్లతో పోలీస్ స్టేషన్ వరకు ర్యాలి చేసారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో పవన్ కళ్యాణ్ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందజేశారు. . పవన్ కల్యాణ మాటలు చాల ఇబ్బంది కరంగ ఉనాయని పలువురు వాలంటీర్లు అన్నారు. కార్యక్రమంలో వినుకొండ మండల యూత్ అధ్యక్షులు బిక్కి నరేంద్ర, వినుకొండ మండల వాలంటీర్స్ యూనియన్ యూత్ అధ్యక్షులు స్టీఫెన్ బాబు మరియు మహిళా వాలంటీర్స్ స్పందన ఝాన్సీ, శివపార్వతి, వినోద్ నాయక్, వై రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

14న మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ.ఆంజనేయులు పుట్టినరోజు పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ శుక్రవారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ రమణ రావు బుధవారం తెలిపారు. నరసరావుపేటరోడ్ లోని గంగినేని ఫంక్షన్ హాల్ నందు 14వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మెడికల్ క్యాంపు జరుగుతుందని, ఉచిత వైద్య శిబిరంలో గుండె (కార్డియాలజీ),ఎముకలు (ఆర్థోపెటిక్), చర్మ సంబంధిత, సాధారణ వ్యాధులకు సంబంధించి అర్హత కలిగిన అనుభవం కలిగిన డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. అలాగే గర్భిణీలు, బాలింతలు, మహిళలకు ప్రత్యేకించి ఆయా విభాగాల్లో అర్హత అనుభవం పొందిన మహిళ వైద్యులచే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు.

పేద విద్యార్థికి లాప్‌టాప్ అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రంమైన పెదకూరపాడు గ్రామానికి చెందిన షేక్ ఫైజును కుమార్తె రేష్మ బీటెక్ విద్యాభ్యాసం కొనసాగించడానికి పడుతున్న ఇబ్బందులు, విద్యాభ్యాసానికి లాప్‌టాప్ ఆవశ్యకతను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సూచన, సహకారంతో నియోజకవర్గ తెలుగు యువత నాయకులు, లింగంగుంట్ల గ్రామస్తులు మేదరమెట్ల సామిత్, పెదకూరపాడు గ్రామానికి చెందిన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, నరసరావుపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ కార్యదర్శి గుడిపూడి చిన్నరాజు, త్రిశక్తి పీఠం ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వం రావులు విద్యార్థికి లాప్‌టాప్ సమకూర్చారు. బుధవారం లాప్‌టాప్‌ను మెదరమెట్ల సామిత్ చేతుల మీదుగా విద్యార్థిని కి అందించారు. బెల్లంకొండ రాంగోపాల్‌రావు, వల్లమూడి అప్పారావు, మిలటరీ మౌలాలి, మస్తాన్ షరీఫ్, అజీముల్లా, మాలాట్ రఫీ, షబ్బీరు, మభూ, జాకీర్, సురేష్, జాగర్లమూడి రఘు తదితరులు ఉన్నారు.

బోయపాలెంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-యడ్లపాడు: యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో బుధవారం నెక్స్ట్ జనరేషన్ సేవ్, వినుకొండకు చెందిన కోస్టల్ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బోయపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వడ్డేపల్లి బ్రహ్మయ్య ఐదో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ క్యాంపులో ముందుగా బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిబిరాన్ని బ్రహ్మయ్య కుమారుడు, వంకాయలపాటి పంచాయితీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహ రావు(రాజు) ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ సాయి కృష్ణ, వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, వైద్యశాల సిబ్బంది, నెక్స్ట్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ ఫౌండర్, చైర్మన్ నాగండ్ల శివరామకృష్ణ, సిబ్బంది కృష్ణవేణి, టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు. పలువురు వైద్య సపర్యలు అందుకున్నారు.

సమష్టి కృషితో లక్ష్యాలను అధిగమించాలి

విశాలాంధ్ర-మేడికొండూరు: మేడికొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో విద్యాబోధన వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్ ధరించిన విద్యార్థులు క్రమశిక్షణతో పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ప్రతిరోజు శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. పాఠశాలలో విద్యా కానుక కిట్ల పంపిణీ, డ్రాప్ అవుట్, 10వ తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈఓ, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. విద్యా కానుక కిట్లను ప్రతిఒక్క విద్యార్థికి అందేలా ఎంఈఓతో సమన్వయం చేసుకొని ప్రధానోపాధ్యాయురాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మఒడి నగదు తల్లుల ఖాతాలో జమ అయ్యే విధంగా బ్యాంకు ఖాతాల ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించుకొని విద్య బోధన అందిస్తుందని పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు తెలిపారు. పదవ తరగతి ఫెయిల్ అయిన ముగ్గురు విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించి వారికి జగనన్న విద్యా కానుక కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మితో కలిసి పాఠశాలలోని ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధనతోపాటు మౌలిక వసతులు కల్పించిందని తెలిపారు. పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత అయ్యేలా ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ఎంఈఓ ఏసురత్నం, ఆలీమ్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

విశాలాంధ్ర-తాడేపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశానుసారం, తాడేపల్లి పట్టణ టీడీపీ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వ్యవహారాల సమన్వయకర్త నందం అబద్దయ్య బుధవారం నియమించారు. తాడేపల్లి పట్టణ 1వ వార్డు అధ్యక్షులుగా కేసరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోట కొండలరావు, 2వ వార్డు అధ్యక్షులుగా కోగంటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొండ శివనాగిరెడ్డి, 4వ వార్డ్ అధ్యక్షులుగా దొంతి రెడ్డి మధుసూదన్ రెడ్డి, 5వ వార్డు అధ్యక్షులుగా యేసుపోగు పృథ్వీరాజు, 9వ వార్డు అధ్యక్షులుగా బిర్నీడి కుమార్, ప్రధాన కార్యదర్శిగా నక్క సువర్ణరాజు, 10వ వార్డు అధ్యక్షులుగా ఉప్పు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి రామారావు, 11వ వార్డు అధ్యక్షులుగా షేక్ ఇమాన్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా మేకతోటి చిన దుర్గారావు, 12వ వార్డు ప్రధాన కార్యదర్శిగా పులి కిషోర్, 13వ వార్డు ప్రధాన కార్యదర్శిగా షేక్ బాజీ, 15 వార్డు అధ్యక్షులుగా తాడిబోయిన గోపి, ప్రధాన కార్యదర్శిగా షేక్ బాజీ, 17వ వార్డు అధ్యక్షులుగా చిలకలపూడి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రేఖ గణేష్ రావు, 18వ వార్డు అధ్యక్షులుగా కొక్కిలిగడ్డ ప్రభావతి, ప్రధాన కార్యదర్శిగా కాకర్ల సాంబశివరావు, 19వ వార్డు అధ్యక్షులుగా చల్లా రంగయ్య, 20వ వార్డు ప్రధాన కార్యదర్శిగా పువ్వుల హనుమంతు, 21వ వార్డు అధ్యక్షులుగా గాజుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మోకా చంద్రం, 22వ వార్డు ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి శివ నాగేశ్వరరావు, 23వ వార్డు ప్రధాన కార్యదర్శిగా పేరం నాగేందర్ రెడ్డిలను నియమించినట్లు టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వ్యవహారాల సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు.

చేనేతలను గుర్తించని మోదీ సర్కార్

విశాలాంధ్ర-మంగళగిరి: టెక్స్‌టైల్ పరిశ్రమలో జరీ ఉత్పత్తులది ప్రత్యేక స్థానమని, జరీ పరిశ్రమ గుజరాత్‌లోని సూరత్ కేంద్రకంగా ఉందని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు ఒక ప్రకటనలో అన్నారు. 90 శాతం జరీ ఉత్పత్తులు ఒక్క సూరత్ పట్టణంలోనే తయారై దేశవ్యాప్తంగా సరఫరా చేయబడతాయన్నారు. జరీ ఉత్పత్తులు రెండు రకాలుగా ఉంటాయని, ఒకటి రియల్ జరీ, రెండవది ఇమిటేషన్ జరీ అన్నారు. రియల్ జరీలో బంగారం, వెండి, రాగి వంటివి ఉపయోగిస్తారని, చేనేత రంగంలో ఉపయోగిస్తారన్నారు. జౌళి రంగంలో రియల్ జరీని ఉపయోగించరన్నారు. ఇమిటేషన్ జరీలో ప్లాస్టిక్, మ్యాన్ మేడ్ ఉత్పత్తులను ఉపయోగిస్తారని చెప్పారు. 2017లో జీఎస్టీ పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు రియల్, ఇమిటేషన్ జరీలపై 12 శాతంగా జీఎస్టీ పన్నును నిర్ణయించారని, సూరత్‌కు చెందిన వ్యాపారులు స్థానిక నాయకత్వం, గుజరాత్ ప్రజాప్రతినిధుల ద్వారా లాబీయింగ్ చేసి రియల్ జరీ పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించుకున్నారన్నారు. చేనేతపై జీఎస్టీని తొలగిం చాలని ఆరు సంవత్సరాలుగా దేశంలోని అఖిలభారత పద్మశాలి సంఘం చేనేత విభాగం, చేనేత ప్రజలు సుదీర్ఘంగా పోరాటం చేస్తున్నా చీమ కుట్టినట్లు లేని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన గుజరాత్ రాష్ట్ర ప్రయోజనాలను మాత్రమే నెరవేరుస్తూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా చేనేతపై ఉన్న ఐదు శాతం జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని లేకుంటే భవిష్యత్తులో ప్రస్తుత పాలకులు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

మణిపాల్ హాస్పిటల్‌లో పెట్ స్కాన్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్లో పీఈటీ సిటి స్కానర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణబాబు బుధవారం ప్రారంభించారు. మణిపాల్ హాస్పిటల్స్, క్యాన్సర్, మెదడు రుగ్మతలు గుండె జబ్బులను ముందస్తుగా గుర్తించేందుకు డిజిటల్ 3డి మామోగ్రఫీ కోసం అత్యాధునిక ఇమేజింగ్ సిస్టమ్‌తో కూడిన పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ(పీఈటీ-సిటి) స్కాన్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. మణిపాల్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ జి.క్రిష్ణారెడ్డి, మణిపాల్ ట్రూటెస్ట్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ నీరజ్ అరోరా, సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ సతీష్ బాబు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ భయంకరమైన వ్యాధులకు సంబంధించిన ముందస్తు లక్షణాలను గుర్తించడం కోసం అత్యాధునిక ఇమేజింగ్ సిస్టమ్‌ను ప్రారంభించడంతో మణిపాల్ హాస్పిటల్స్ పరిసర ప్రాంతాల్లోని రోగులకు అత్యుత్తమ నాణ్యమైన వైద్యం, చికిత్సను అందించడానికి వారిని చేరు కోవడంలో ఒక అడుగు ముందుకు వేసిందని అన్నారు. మణిపాల్ హాస్పి టల్స్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ పీఈటీ-సిటి స్కాన్‌లు కణితి ఖచ్చితమైన పరిమాణం స్థానాన్ని చూపుతాయని, ఇది రోగికి అత్యంత ప్రభావవంతమైన చికిత్సా మార్గాన్ని సూచించడానికి వీలు కల్పిస్తుందని అన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జగనన్న సురక్ష రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర-బెల్లంకొండ: ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క సంక్షేమ పథకం ప్రతి కుటుంబానికి అందాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశ్యమని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ చన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. బెల్లంకొండ మండల పరిధిలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జీదారులకు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు, అవసరమైన సర్టిఫికెట్లను, ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏవైనా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రజలకు శ్రీరామరక్షలాగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని వలంటీరు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చిందన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ అవాక్కు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గుంటూరు జీజీహెచ్‌లో కార్డియో థొరాసిస్ వ్యాక్సులర్ (సిటీవీఎస్) సర్జన్ విభాగంలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు శస్త్ర చికిత్సలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. సూపరింటెండెంట్ తనిఖీలలో భాగంగా బుధవారం సిటీవీఎస్ వార్డును పరిశీలించారు. ఈ వార్డులో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో ఇద్దరికి ఆపరేషన్లు చేస్తున్న సమయంలో సిటీవీఎస్ విభాగం వైద్యులు స్థానంలో కాంట్రాక్ట్ వైద్యుడు పని చేయడం విస్మయానికి గురిచేసిందన్నారు. ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా కాంట్రాక్ట్ వైద్యుడు ఆపరేషన్ ఎందుకు చేయాలంటూ ఆ విభాగం హెచ్‌ఓడీని ప్రశ్నించారు. దీంతో డాక్టర్ మోతిలాల్ ఒరా ఈ విభాగం బాధ్యతలను నిర్వర్తించలేకపోతున్నానని...ఎవరు నా మాట వినడం లేదు. కావాలంటే మార్చమని సమాధానం ఇచ్చారు. ఈ నేపధ్యంలోనే కాంట్రాక్ట్ వైద్యుడికి ఆ పని అప్పగించానన్నారు. ఈ వార్డులో ఉన్న అయిదుగురులో ఏ ఒక్కరూ శస్త్ర చికిత్స కేసులను చూడటం లేదని, కేవలం కాంట్రాక్ట్ వైద్యుడు మాత్రమే చూస్తున్నాడని సూపరింటెండెంట్‌కు ఆయన బదులిచ్చారు. అదేవిధంగా వేరే వార్డు రిఫర్ చేసిన కేసులు, క్లాసుల నిర్వహణ కూడా ఈ కాంట్రాక్ట్ వైద్యుడే చూస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి వైద్యులు బాధ్యతగా పని చేయాలని సూచించారు.

దేశానికి బీఎస్పీనే ప్రత్యామ్నాయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అరండల్‌పేటలోని ఓ కళ్యాణ మండపంలో గుంటూరు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు సిటీలో ఉన్న నియోజకవర్గాల కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ 175 నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు, కార్యకర్తల్లో చైతన్యం కలిగించటానికి శిక్షణా తరగతులు నిర్వహించారు. బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పీవీ రమణయ్య, బీఎస్పీ గుంటూరు తూర్పు ఇన్‌ఛార్జ్ మణికుమారి, బీఎస్పీ పశ్చిమ ఇన్‌ఛార్జ్ చిరతనగండ్ల వాసు, బీఎస్పీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కిషోర్, తన్నీరు సాంబయ్య, కూరపాటి సుబ్బారావు, నల్లపు నీలాంబరం ఉన్నారు.

పల్నాడులో 90శాతం ఇంటింటి సర్వే పూర్తి

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఇంచుమించుగా ఇంటింటి సర్వే 90 శాతం క్యాంపులు 40% పూర్తయినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు సమస్యలు, హౌసింగ్ కు సంబంధించిన సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకున్న వారికి 1.5 వడ్డీ రాయితీ ఉంటుందని, ఒక సంవత్సరం లోపు రుణం చెల్లిస్తే మూడు శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా మూడు దరఖాస్తులను బ్యాంకు వారికి అందజేయడం జరిగిందని త్వరలో బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సేవలు

విశాలాంధ్ర-దుర్గి: ప్రజలకు ఇంటి ముంగిటికే సేవలు, సర్టిఫికేట్లు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో కె.సమతావాణి అన్నారు. దుర్గి వాసవీ కళ్యాణ మండపంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక రకాలు పథకాలు అందాలంటే లబ్ధిదారులకు కావల్సిన సర్టిఫికేట్లు పొంది ఉండాలన్నారు. ఆ సర్టిఫికేట్లు ఎవరికైతే లేవో వారు పథకాలకు దూరమవుతున్నారని, వారికి కూడా పథకాలు అందించాలని ముఖ్యమంత్రి జగన్ గత నెల 23న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. ప్రజలు సర్టిఫికేట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి కావలసిన సర్టిఫికేట్లు ఈ కార్యక్రమం ద్వారా ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందిస్తున్నామన్నారు. సర్పంచ్ ఆర్.మాణిక్యం, ఎంపీటీసీ కె.గోపాల్, వెల్దుర్తి, దుర్గి మండలాల వలంటీర్ల మండల లెవల్ ఆఫీసర్ టి.శంకర్, సచివాలయాల మండల కన్వీనర్ బి.సీతారామిరెడ్డి, వైసీపీ మండల ప్రచార కమిటీ కన్వీనర్ టి.వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ ఇస్తేరురాణి, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, ఈఓపీఆర్డీ గుప్తా, వీఆర్వో కోటేశ్వరరావు, పద్మావతి, సెక్రటరీ కృష్ణ, కె.చినవెంకటయ్య, వై.బుచ్చిబాబు తదితరు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై నిరంతరం పర్యవేక్షణ

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సేవల దరఖాస్తులను సక్రమంగా సేకరించి నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారితో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి ఎన్నికల కమీషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం డోర్ టు డోర్ ఓటరు కార్డుల వెరిఫికేషన్ సక్రమంగా జరిగేలా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బీఎల్ఓలతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద జాబ్ కార్డ్ పొందిన విభిన్న ప్రతిభావంతులకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా పని కల్పించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామి రెడ్డి, జెడ్పీ సీఈఓ జె.మోహన్ రావు, డీఆర్వో కె.చంద్రశేఖర రావు, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, మెప్మా పీడీ వెంకట నారాయణ, డీఈఓ శైలజ, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: మండలంలోని ములకలూరు ఎస్సీ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలను బుధవారం సర్పంచ్ కంచర్ల బాబుతో కలిసి ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారి సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-దుర్గి: జగనన్న సురక్ష పథకం సర్వే చాలా నెమ్మదిగా జరుగుతుందని వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.సమతావాణి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో జగనన్న సురక్ష సర్వే చాలా నెమ్మదిగా జరుగుతుందని సమాచారం రావడంతో ఆమె బుధవారం గ్రామానికి వెళ్ళి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ సర్వే వేగం పెంచాలని సూచించారు. ఆమె వెంట వెల్దుర్తి, దుర్గి మండలాల వలంటీర్ల ఎంఎల్ఓ తోటకూర శంకర్, సచివాలయ సెక్రటరీ వెంకటరెడ్డి ఉన్నారు.

సత్యాగ్రహ దీక్షకు మంగళగిరి కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గం నుంచి విజయవాడలో జరిగే మౌన సత్యాగ్రహ దీక్షకు కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా తరలివెళ్ళారు. విజయవాడ ధర్నా చౌక్‌లో మౌన సత్యాగ్రహ దీక్షకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నాయకత్వంలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారు. సందర్భంగా కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సాగనంపటానికి, అలానే 2024లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని అన్నారు. సత్యాగ్రహ దీక్షకు తరలివెళ్లిన వారిలో రమణి శెట్టి హనుమంతురావు, కొప్పాకుల కృష్ణారావు చౌదరి, గోలి సాంబశివరావు, గుడిపాటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియంను సందర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరిలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంను కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ సెక్రెటరీ గోపినాథ్ రెడ్డితో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీఏ సెక్రెటరీతో కలసి స్టేడియం అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మహిళా క్రికెటర్లను కలసి వారికి మార్గనిర్దేశం చేశారు. స్టేడియం అతి త్వరలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని, దానికి కావలసిన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తహశీల్దార్ రామ్‌ప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.వెంకట శివారెడ్డి, మేనేజర్ భాస్కర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-తెనాలి: తెనాలిలో జనసేన ఆధ్వర్యంలో జనసైనికులు, వీర మహిళలు మార్కెట్ చౌరస్తాలో పాల్గొని పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పసుపునీళ్ళతో ప్రక్షాళన చేసి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు జనసైనికులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. వైకాపా నాయకులు అదేపనిగి పవన్‌ను విమర్శిస్తున్నారని అందుకు నిరసన తెలుపుతూ బుధవారం నల్లబ్యాడ్జీలతో జనసేన నాయకులు కాలినడకన గాంధీచౌక్ నుండి తెనాలి మార్కెట్ సెంటర్ వద్దకు చేరుకొని వైసిపి దాష్టికాలను వారాహి యాత్ర ద్వారా ఎండగడుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పలేక జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మలను తగలబెడుతున్న చేతగాని ప్రభుత్వంపై నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో హరిదాసు గౌరిశంకర్, తోటకూర వెంకట రమణారావు, ఇస్మాయిల్, యర్రు వెంకయ్యనాయుడు, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: జగనన్న భూహక్కు భూరక్ష పథకం కింద చేపట్టిన భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే రికార్డు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వేకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో భూ యజమానులకు 9(2) నోటీసులు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భూ యజమానికి 9(2)నోటీసులు తప్పని సరిగా అందేలా చూడాలని తెలిపారు. అలాగే మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే పనులు పూర్తయ్యాయని, వేల్పూరు, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాలలో రైతులకు 9(2) పత్రాలను పంపణీ చేస్తున్నామన్నారు.

వినుకొండ పురపాలక సంఘం

కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 144/2023/ఎ2 తేది. 12.07.2023.
వినుకొండ

వినుకొండ పురపాలక సంఘ పరిధిలోని నరసరావుపేట రోడ్డు నందలి మునిసిపల్ ఖాళీ స్థలము సర్వే నెం. **399/1ఎ, 400, 401/1** నందు వినుకొండ మునిసిపల్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ 246 షాపులను 9 బ్లాకులుగా గుడ్విల్ పద్ధతిపై నిర్మాణం చేయుటకు ప్రభుత్వం వారు **జి.ఓ.ఆర్.టి.నెం. 105, యం.ఎ & యు.డి (జె1)** డిపార్ట్‌మెంట్, **తేది. 15.02.2023** ద్వారా పరిపాలనా అనుమతి పుత్తర్వులు జారీ చేసియున్నారు. అందుపై ప్రభుత్వ ఉత్తర్వులు **జి.ఓ యం.యస్. నెం. 21, యం.ఎ & యు.డి (జె1)** డిపార్ట్‌మెంట్ **తేది 18.01.2013** మేరకు గుడ్విల్ ఆక్షన్ నియమ నిబంధనలు ననుసరిచి రాబడిన మద్దతు ధరపై మరియు వేలము షరతులకు లోబడి వేలము నిర్వహించుటకు గాను వినుకొండ పురపాలక సంఘ కౌన్సిల్ వారు **తీర్మానం నెం. 867, తేది. 04.03.2023** ద్వారా ఆమోదించి యున్నారు. సదరు వేలము నోటిఫికేషన్ పల్నాడు జిల్లా గజెట్ నందు **నెం. 10/2023, తేది.07.03.2023** మేరకు నోటిపై చేసియున్నందున గుడ్విల్ ప్రాతిపదికతపై నిర్మించు షాపురూములకు ఈ దిగువ తెలిపిన విధముగా బహిరంగ వేలము **ది. 27.07.2023**న గురువారం **ఉదయం గం॥ 11.00 ని॥ల** నుండి నరసరావుపేట రోడ్‌లో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణము చేయు మునిసిపల్ ఖాళీ స్థలము నందు నిర్వహించబడును.

ఇతర సమాచారము (గజెట్లోని నిబంధనలు ప్రకారము రిజర్వే షన్లు, డిపాజిట్, సాల్వెన్సీ మరియు ఇతర వివరములు) కొరకు పుర పాలక సంఘ కార్యాలయ రెవిన్యూ విభాగం నందు కార్యాలయ పని వేళలలో **ఉ.గం.10.00 నుండి సా. గం. 5.00** లోపు సంప్రదించగలరు.

సం॥ పి. వెంకయ్య
కమీషనరు,
వినుకొండ పురపాలక సంఘం.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

డ్రాప్‌అవుట్స్ నిర్మూలనకు తక్షణ చర్యలు

విశాలాంధ్ర-బాపట్ల: పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రధానాచార్యులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నిక్షిప్తం చేయాలని తెలిపారు. జూనియర్ కళాశాలల్లోనూ డ్రాప్స్ నివారణకు అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పదో తరగతిలోపు 2,676 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా గుర్తించామన్నారు. విద్యార్థులంతా ఎక్కడున్నారో ఏం చేస్తున్నారోననే వివరాలను స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నిక్షిప్తం చేసే బాధ్యత జిల్లాలోని 252 మంది ప్రధానోపాధ్యాయులదేనన్నారు. బడి ఈడు పిల్లలను ఈనెల 14వ తేదీలోగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బల్లికురవ మండలంలో 368 మంది విద్యార్థులు బడి బయట ఉంటే విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఏం చేస్తున్నారని కలెక్టర్ నిలదీశారు. కర్లపాలెం మండలంలో 258 మంది, చీరాలలో 250 మంది, నగరంలో 192 మంది, కొల్లూరులో 177, నిజాంపట్నంలో 172, కారంచేడులో 168, చెరుకుపల్లిలో 154 మంది విద్యార్థులు బడి బయటనే ఉన్నారని, వారిని తక్షణమే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, చైతన్య పరచాలన్నారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. ఇటీవల పదో తరగతి పరీక్షలలో 12,500 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. జిల్లాలోని 113 జూనియర్ కళాశాలలో 6,619 మంది మాత్రమే చేరారన్నారు. మిగిలిన వారంతా కళాశాలలో జరగలేదు. ఏం చేస్తున్నారు ఏ ప్రాంతాలకు వలసలు వెళ్లారో గుర్తించి కారణాలను స్టూడెంట్ ఇన్ఫోలో నిక్షిప్తం చేయాలని సూచించారు. జిల్లా దాటి ఎంతమంది బయటకువెళ్లారో గుర్తించి యాప్ లో నమోదు జిల్లాలలోని అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన 424 మంది విద్యార్థులను పునఃనియామకంతో పాఠశాలలో చేర్పించామన్నారు. అలాంటి విద్యార్థులకు జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక పథకాలను తక్షణమే వర్తింప చేయాలన్నారు. బాపట్ల మండలంలో 230 మంది విద్యార్థులు పదో తరగతిలో ఫెయిల్ అయితే 168 మందిని పాఠశాలల్లో చేర్పించారని మిగిలిన వారిని తక్షణమే చేర్పించాలన్నారు. చీరాలలో 323 మంది ఉండగా, వేటపాలెంలో 162, రేపల్లెలో 145, కర్లపాలెంలో 105 మంది విద్యార్థులు ఉండడంపై ఆరాతీశారు. నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, ఇంటర్మీడియట్ బోర్డ్ డి ఐ ఓ ఆంజనేయులు, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీ రామారావు, అనుబంధశాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం వైపు గురిపెట్టి చదవాలి

గెలుపు ఓటములను ఒకటిగానే భావిస్తూ ఉన్నత లక్ష్యం వైపు గురి పెట్టి ఉద్యోగం పొందడమే లక్ష్యంగా కష్టపడి చదవాలని జిల్లా కలెక్టరు పి.రంజితా బాషా తెలిపారు. పదోతరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను పునఃనియామకం ద్వారా పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు బుధవారం ప్రారంభించారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థులను చేర్పించారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను కలెక్టరు చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఆ పాఠశాలలో 121 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా 36 మంది ఫెయిల్ అవడంపై కలెక్టరు ఆరా తీశారు. అధికంగా సైన్స్ సబ్జెక్ట్ నే విద్యార్థులు ఫెయిల్ అవ్వడంపై సంబంధిత ఉపాధ్యాయురాలిని మందలించారు. షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డి.ఇ.ఓను ఆదేశించారు. ఆయన వెంట బాపట్ల ఆర్.డి.ఓ జి.రవీందర్, డి.ఇ.ఓ పి.వి.రామారావు, ఎమ్.పి.డి.ఓ రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

తీరప్రాంత భద్రత పరిరక్షణకే సాగర్ కవచ్

విశాలాంధ్ర-బాపట్ల: తీరప్రాంతంలో ఉగ్రవాద కదలికలకు సంబంధించిన సమాచారం సేకరించడానికి, చొరబాట్లను అడ్డుకోవడానికి విధ్వంసక పదార్థాలను గుర్తించడానికి చొరబాటుదారులను విచారించి సముద్ర తీర భద్రతను పరీక్షించడానికే సాగర్ కవాచ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని తీర సముద్రతీర ప్రాంతంలో బుధవారం సాగర్ కవాచ్ కార్యక్రమంలో భాగంగా తీరం వెంట 200 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉగ్రవాద దాడి జరిగినప్పుడు పోలీసుల సంసిద్ధతను అంచనా వేయడానికి కోస్టల్ గార్డ్, మెరైన్ పోలీసులు, పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల పాటు సాగర్ కవాచ్ తీర భద్రతా వ్యాయామంను పోలీస్ బృందాలను వివిధ దశలలో జరుపుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసు బృందాలను మోహరిం చారు. పోలీసు బృందాలు వ్యాయామంలో భాగంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్ పటిష్ట బందబస్తును నిర్వహిస్తూ వాహన తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదులుగా వ్యవహరించే రెడ్ టీం జిల్లా తీర ప్రాం తంలో చొరబడడానికి ప్రయత్నిస్తే సమర్థ వంతంగా అడ్డుకోవాలన్నారు. రైల్వే స్టేషన్‌లలో, బస్టాండ్‌లలో ముఖ్యమైన ప్రదేశాలలో కూడా వాహనాలను తనిఖీ చేయాలనీ జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

మహిళలపై షాడో చైర్మన్ దురుసు ప్రవర్తన

విశాలాంధ్ర-రేపల్లె: ఇలాంటి వారినా మీరు వెంటేసుకొచ్చేది...! మీరు ఎవరికి కట్టారు, ఎవరిని అడుగుతున్నారు. వెళ్లి వాళ్లనే అడగండి ఇది మా గవర్నమెంట్ మమ్మల్ని అడగటానికి మీరెవరు..! ఇది సాక్షాత్తు మున్సిపల్ కమిషనర్ ముందు షాడో చైర్మన్ మహిళల పట్ల వ్యవహరించిన తీరు. బుధవారం సీపీఐ పార్టీ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆధ్వర్యంలో మహిళా టిడ్కో గృహాల లబ్ధిదారులు మున్సిపల్ కమిషనర్ విజయసారధికి వినతిపత్రం అందజేసేందుకు కమీషనర్ ఛాంబర్ లోనికి వెళ్లారు. వినతి పత్రం అందజేసిన సీపీఐ నాయకులు మహిళలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను చెప్పుకుంటున్నారు. సార్ అప్పులు చేసి ప్రభుత్వం కట్టమన్న రూ.25 వేలు కట్టము. ఇప్పటికి ఐదు సంవత్సరాలు దాటింది, తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతున్నాము, అద్దె ఇళ్లల్లో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు. మరి కొందరు ప్రస్తుతం ఉంటున్న చోట వర్షాకాలంలో దోమలు, పాములతో బాధలు పడుతున్నామని వారు ఎదుర్కొంటున్నా ఇబ్బందులను వివరిస్తున్నారు. ఇంతలో కమీషనర్ ఎదుట కూర్చొని ఉన్న చైర్ పర్సన్ కట్టా మంగ భర్త సుబ్బారావు బాధలు చెప్పుకుంటున్న మహిళలను ఉద్దేసించి వ్యంగ్యంగా ఇలాంటి వారినా.. వీళ్ళు వెంటబెట్టుకొచ్చారు అంటూ విరుచుకుపడ్డారు. మీరు ఏ ప్రభుత్వానికి కట్టారు, ఎవ్వరిని అడుగుతున్నారు. మేము చెయ్యము చెయ్యాల్సిన అవసరం లేదంటూ దుర్భాషలాడారు. కవరేజీకి వచ్చిన విలేకరి విషయం తెలుసుకుని మాట్లాడండి సార్ అన్నందుకు నీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సీపీఐ నాయకులకు, సదరు షాడో చైర్మన్ కు స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సిపిఐ నాయకులు బాలాజీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వటానికి వచ్చాము వీలైతే సమస్య పరిష్కారానికి కృషి చెయ్యండి అన్నారు. రేపల్లెలో టిడ్కో లబ్ధిదారులు సుమారు 5 వేలమంది ఉన్నారు. ప్రజాప్రతినిధి గా ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వలంటర్ల సేవలు ఓకే... కానీ పలు సమస్యలున్నాయి

విశాలాంధ్ర-రేపల్లె: వాలంటరీలు సేవలందించారు అందుకు అభినందనీయం కానీ వారిలో కొందరి వలన సమస్యలు ఉన్నాయని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఏలూరు సభలో కొందరు వాలంటరీల మరో కోణంలో ఉన్న లోపాలను బహిర్గతం చేశారన్నారు. కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల మేరకు రాష్ట్రంలో 29,279 మంది మహిళలు మిస్ అయ్యారని చెప్పినప్పుడు కారణాలను, పరిష్కార మార్గాలు వెలికి తీయాల్సిన ప్రభుత్వ పెద్దలు వాలంటరీలను రెచ్చగొట్టి అప్రజాస్వామిక విధానంలో పవన్ కళ్యాణ్‌ను దుర్భాషలాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు నెహ్రూ విగ్రహం సెంటర్‌లో పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. హలో ఏపీ బైబై వైసిపి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వాలంటరీ వ్యవస్థపై చర్చ పెట్టే దైర్యం అధికార పార్టీ పెద్దలకు ఉందా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని సూచించిన ప్రతిపక్ష నేతలపై ఎదురుదాడి చేయటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని హితవు పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

విశాలాంధ్ర-రేపల్లె: పట్టణంలోని టిట్కో గృహాల నిర్మాణ పనులను ప్రారంభించి సత్వరం పూర్తిచేసి లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేయాలని సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన టిట్కో గృహాల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ విజయ సారథి కి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేరుతుంది అన్న కొండంత ఆశతో లబ్ధిదారులు అప్పు చేసి రూ. 12500 నుంచి రూ. 50 వేల వరకు ప్రభుత్వానికి చెల్లించారని తెలిపారు. అంతేకాకుండా లబ్ధిదారుని పేరుతో బ్యాంకుల నుండి లక్షలాది రూపాయల రుణం ప్రభుత్వం తీసుకుందన్నారు. గత నాలుగేళ్లుగా టిట్కో గృహాలు పంపిణీ గాక బయట చేసిన అప్పులకు, బ్యాంకులో చేసిన రుణాలకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, మరోవైపు ఇంటి అద్దెలు కట్టలేక ఆర్థికపరమైన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి దశల వారి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిట్కో లబ్ధిదారులు డి. సాంబశివరావు, ఎం. పార్వతి, కృష్ణవేణీ, దాసరి రమణ, నాగేశ్వరమ్మ, శ్రీరాములు, డి. లలిత, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నియామకం

విశాలాంధ్ర-మార్టూరు: టీడీపీ పర్చూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా షేక్ రసూల్, షేక్ రియాజ్ భాషాలు నియ మితులయ్యారు. ఈ మేరకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన కమిటీని ఆమోదించారు. పర్చూరు నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులకు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీలకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాల ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ముస్లిం సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. సమన్వయంతో పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.బుధవారం మండల పరిధిలోని కొనిదన గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసి పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని నిరుపేదలు ఎవరైనా ఉంటే అలాంటివారిని గుర్తించి వారి సమస్యను సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే దృఢ సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి గ్రామ సర్పంచి తన్నీరు లేపాక్షి విష్ణు,తాసిల్దార్ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి సీతామహాలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు,మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్విపి కుమారి సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పుర్వ వైభవం తీసుకువస్తాం

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని కేంద్ర మాజీమంత్రి జె.డి శీలం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సదస్సు పట్టణంలో బుధవారం జరిగింది. మున్సిపాలిటీ ఆఫీస్ దగ్గర ఉన్న మిసైల్ మాన్ ఆఫ్ ఇండియా, భారత మాజీ రాష్ట్రపతి ఏ.పీ.జే అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అంబెడ్కర్ భవన్‌లో జరిగిన సభలో జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మత పరమైన అంశాలు అనుసరించ కుండా వైఎస్ఆర్సిపి, తెలుగుదేశం పార్టీ,రెండు పార్టీలు కూడా వ్యతిరేకంగా ఉంటామని బిజెపికి హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఈ దేశం కోసం ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ఇద్దరు కూడా ఈ దేశం కోసం వారి ప్రాణాలు ఇచ్చారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పాలనలో సుఖ సంతోషాల గడిపిన రోజులు గుర్తు చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పాలలో రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పాలన వల్ల ప్రజాలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జేడీ శీలం బాపట్ల పార్లమెంటు పరిధిలోకి వేలు మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలను నిరంకుశ పాలనకుకు నిదర్శనమన్నారు. మహిళకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజా సమస్యలు గురించి పార్లమెంట్‌లో అధికార పార్టీ బీజేపీని నిలదీస్తే రాహుల్ గాంధీని సస్పెండ్ చేశారన్నారు.తెలుగుదేశం , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, జనసేన పార్టీ, మూడు పార్టీలు కూడా బిజెపికి వంత పడుతున్నాయని ఇప్పటివరకు ఒక్కసారి కూడా నరేంద్ర మోడీని ప్రశ్నించిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాలనలో ప్రజలుకు చేసిన అభివృద్ధి గుర్తు చేశారు. పేదలకు ఇల్లు, భుసంస్కరణ చట్టం తీసుకువచ్చి భూముల లేని పేదవాళ్ళు కు భూములు ఇచ్చిన ఘనత ఇందిరాగాంధీ కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో పూర్వ వైభవాన్ని నెలకొల్పేందుకు నిత్యం కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి,ఏపీ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు దాదా ఫీర్ గాంధీ, ప్రధాన కార్యదర్శి రహమత్ అలీ, జిల్లా మైనారిటీ అధ్యక్షులు పట్టాన్ రాజేష్ బాపట్ల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దేవరాజు, బాబురావు,కుమార్ , రోశయ్య ,శీలం సాగర్, దండు రేణుకా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం ఎప్పుడు? కేసన

విశాలాంధ్ర-బాపట్ల: రాజ్యాంగపరంగా వెనుకబడిన తరగతుల వారికి శాసనసభలలో పోటీ చేయడానికి రిజర్వేషన్ కల్పించకపోయినప్పటికీ, బీసీ సంఘాల రాజకీయ చైతన్యంతో వివిధ పార్టీల్లో సీట్లు దక్కించుకుని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు విజయం సాధించిన నేతలు చట్టసభల్లో గళం విప్పాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. బాపట్లలో బుధవారం పర్యటించిన కేసన మీడియాతో మాట్లాడుతూ వివిధ పార్టీల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా విజయం సాధించి మంత్రివర్యులుగా కొనసాగుతున్న బీసీ పాలకులు బీసీ సామాజిక వర్గానికి ఏం న్యాయం చేసే విధంగా ఏం పని చేశారో ప్రశ్నించుకోవాలన్నారు. ఆధిపత్య కులాల నేతలకు వత్తాసు పలుకుతూ తమ బాధ్యతలను విస్మరించటం బాధకరమన్నారు. బీసీల అభ్యున్నతకు పనిచేస్తున్న బీసీ సంఘాల నేతలను వివిధ పార్టీలకు చెందిన బీసీ నేతలే విమర్శించటం సామాన్య ప్రజలు సైతం ముక్కును వేలేసుకుంటున్నారన్నారు. బీసీ నాయకులు అనే ముసుగులో పదవులు పొందుతూ తమ జాతికి ఏం న్యాయం చేశామో తమకు తామే విమర్శించుకోవాలన్నారు. ఎన్నికల్లో విజయం సాధిం చడం కొరకు బీసీ కార్డును ఉపయోగించి గెలుపొందిన అనంతరం అధికార, ప్రతిపక్ష పార్టీలలో తమకుతామే వ్యక్తిగతంగా ఎదగటానికి బాటలు వేసుకుంటున్నా రన్నారు. బీసీ ప్రజల అభ్యున్నతి విస్మరించటం ఎంతవరకు నైతికమవుతుందని ప్రశ్నించారు. బీసీల సంక్షేమానికి తాము ఎంత పనిచేస్తున్నమో గుర్తించుకోవాలని హెచ్చరించారు. దమాషా లెక్కల ప్రకారం బీసీలకు రావలసిన నిధులను ఖర్చు పెట్టే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో మంత్రివర్యులుగా కొనసాగుతున్న బీసీ నేతలు ఎంత వరకు పని చేస్తున్నారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. బీసీల అభ్యున్నతే మా లక్ష్యంగా తమ సంఘం పనిచేస్తుందని వివరించారు. బీసీలలో రాజ కీయం చైతన్య తేవటానికి పలు ఉద్యమాలు చేస్తూ సభలు, సమా వేశాలు నిర్వహిస్తూ వారి సంక్షేమం దిశగా అహర్నిశలు అలుపెరగని కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలతో ఓటరు వెరిఫికేషన్

విశాలాంధ్ర-చీరాల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఇంటింటికి తిరిగి ఓటరు వెరిఫికేషన్ బిఎల్ఓ ద్వారా చేయడం జరుగుతుందని,బూత్ లెవల్ ఆఫీసర్లకు రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజంట్లు పర్యవేక్షించి దొంగ ఓట్లను తొలగించాలని ఆర్డీవో సరోజిని అన్నారు.బుధవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వారు స్పెషల్ సమరీ రివిజన్ షెడ్యూల్ జారీచేశారని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఇంటింటికి తిరిగి ప్రతి ఓటరును వేరిఫికేషన్ చేస్తామని అన్నారు.బూత్ లలో వేరిఫికేషన్ జరిగేటప్పుడు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ నాయకులు అధికారులకు సహకరించి,దొంగ ఓట్లు నమోదుకాకుండా, ఎవరైనా ఓటర్లు చనిపోయి ఉంటే ఆ ఓట్లు తొలగించే విధంగా చూడాలని అన్నారు.

డాక్యుమెంట్ పోయినది

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం శ్రీరాం నగర్ గ్రామానికి చెందిన **ఏట్రా వరలక్ష్మీ భర్త జయంత్‌రెడ్డి** అను నేను **15-06-2023** తేదీన డాక్యుమెంట్లు జిరాక్స్ నిమిత్తం పిట్టలవాని పాలెం నుండి చందోలు స్కూటీ పై వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. ఎంత వెతికినను కనిపించలేదు.

డాక్యుమెంట్ నెం : 174/2019 సర్వే నెంబరు : **365/1 (యాజలి)** ఎవరికైనా దొరికిన యెడల **6302941706** నెంబరుకు తెలియజేయగలరు.

20న ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్

విశాలాంధ్ర-చీరాల రూరల్: చీరాల 23 ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఈనెల 20 వరకు స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో కంబైన్డ్ యాన్యుయల్ ట్రైనింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు గుంటూరు గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ క్యాంప్‌లో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు పరిధిలోని వివిధ విద్యాసంస్థల నుండి క్యాడెట్లు పాల్గొంటున్నారు. టీఎస్ సీ కి ఎంపిక కాబడిన వారికి ఫైరింగ్, మ్యాప్ రీడింగ్ వంటి వాటిలో పోటీలు ఉంటాయని తెలిపారు. కల్నల్ సునీల్ గౌతమ్, ముకుందన్, మేజర్ అంజిరెడ్డి, బాపయ్య శెట్టి, సుదేష్ కుమార్, సురేష్, శ్రీమన్నారాయణ, గోపి, మిలిటరీ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర-బల్లికురవ: ప్రపంచ మానవాళికి క్రీస్తు మార్గం అనుసరణీయం అని శాపు నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.బుధవారం మండల పరిధిలోని వెలమవారిపాలెం చిన్న జమ్మలమడక గ్రామంలో ప్రార్థనా మందిర ప్రతిష్టారాదన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చైతన్య మాట్లాడుతూ బైబిల్, భగవద్గీత, కురాన్ లాంటి పవిత్ర గ్రంథాల సారాంశం ఒక్కటేనని, ప్రజలంతా శాంతి మార్గంలో పయనిస్తూ అహింసను విడనాడిన రోజున క్రీస్తు బోధనలకు సార్థకత చేకూరుతుందన్నారు. ప్రపంచంలో మానవజాతి ఒకటే కులం అని, ప్రజలంతా సోదర భావంతో మమేకమైన రోజున ప్రపంచ శాంతి సాధ్యమవు తుందన్నారు. బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,జేసిఎస్ మండల ఇంచార్జ్ టి నరేష్ పాల్గొన్నారు.

జనసేనలోకి ఆమంచి స్వాములు

విశాలాంధ్ర-చీరాల: చీరాల నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములు ఈ నెల 15వ తేదీ శనివారం జనసేన పార్టీలో చేరనున్నారు. చీరాల నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలుకనున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఆలా వెంటేశ్వరరావు(శ్రీధర్) పాపారాజుతోటలోని నివాసంలో విలేఖర్లతో మాట్లాడారు. చీరాల నియోజకవర్గం నాయకులు ఆమంచి స్వాములు ఈ నెల 15న మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. త్వరలో చీరాల నియోజకవర్గంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా లోకేష్ యువగళం యాత్ర

విశాలాంధ్ర-చీరాల: లోకేష్ పాద యాత్ర ప్రారంభించే ముందు వైసీపీ నాయకులు లోకేష్ నడవగలడా అంటూ లోకేష్ పాదయాత్రను హేళనతో ఎగతాళి చేశారని, నేడు లోకేష్ ప్రజా సమస్యలు తెలుసు కుంటు యువ గళం పాదయాత్ర దిగ్విజయంగా 2000 కిలోమీటర్లు పూర్తిచేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవతోటి నాగరాజు బుధవారం మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్ ప్రజా సమస్యలను వెలికితీస్తూ నిరుద్యోగ యువకుల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ అప్రతిహతంగా పాదయాత్ర కొనసాగిస్తు న్నారని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు

విశాలాంధ్ర-చీరాల రూరల్: నియోజకవర్గంలోని కొత్తపేట-3 గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చీరాల వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అవసరమైన వారికి ధ్రువ పత్రాలను వారి ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ శర్మ, డిటి మహేశ్వరి, సచివాలయం సిబ్బంది, వైకాపా నాయకులు చుండూరు వాసు, మారుబోయిన పాపారావు, తులసి రామ్, షేక్ బాషా, రమేష్, నెహ్రూ, శ్రీనివాసరావు, బాబీ, బాషా, గోపి, పులి వెంకటేశ్వర్లు సచివాలయం కన్వీనర్లు, మండల కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

యానాదులకు అన్యాయం చేస్తే కలెక్టరేట్ ముట్టడిస్తాం

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: బాపట్ల మండలం సూర్యలంక యానాదుల గుడిసెలను అర్ధరాత్రి తొలగించడాన్ని నిరసిస్తూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య ఆధ్వర్యంలో బాపట్ల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కెసి పెంచలయ్య మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా యానాదులు సూర్యలంకలో నివాసం ఉంటున్నారని, అర్ధరాత్రి వారి గుడిసెలను తొలగించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యందేటి వెంకటసుబ్బయ్య, బాపట్ల జిల్లా అధ్యక్షులు చౌటూరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు తిరువెళ్ల శ్రీనివాసులు, రాపూరి సుధీర్, తలపల రామకృష్ణ, చేవూరు గోపి, యాటగిరి గోపి, తాడిశెట్టి గౌరి శంకర్, యానాది మహానాడు అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సమస్యలకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-అద్దంకి: జగనన్న సురక్షలో ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు.బుధవారం అద్దంకి మున్సిపాలిటీలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ అర్హులై ఉండి ఏఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపన,తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏచిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో నెలరోజుల పాటు నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్,జగన్ ఈకార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు.జగనన్న సురక్ష ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టనుందని తద్వారా వారికి లబ్ది చేకూర్చడంతో పాటు 11రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో 631 మందికి పలు రకాల దృవీకరణ పత్రాలను కృష్ణచైతన్య అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ,వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కమీషనర్ బి,శ్రీనివాసులు,వార్డు కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.